క్లుప్తంగా

అభయాంజనేయుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన అభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పూజారి శివశర్మ స్వామి వారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

రైల్వేకోడూరు : పట్టణంలోని అరుంధతివాడలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తమ స్వంత నిధులు లక్షలాది రుపాయలతో మాతమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

నేడు జగనన్న కాలనీలో రోడ్డు ప్రారంభం

సంబేపల్లె : నారాయణరెడ్డిపల్లె పరిధిలో ఉన్న జగనన్న కాలనీకి కడప – చిత్తూరు జాతీయ రహదారి నుంచి రూ. 1.85 కోట్లతో నిర్మించిన రోడ్డును బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మండల ఎంపీడీఓ నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఏఐపీపీ ప్రెసిడెంట్ అశోక్ చౌహాన్‌తో చిదంబర్‌రెడ్డి

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ ప్రెసిడెంట్ అశోక్ చౌహాన్, సెక్రటరీ ధ్యాన్‌చంద్‌సింగ్‌లను వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, గుట్టపల్లె సర్పంచ్ చిదంబర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలోని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి నివాసంలో ఏఐపీపీ సభ్యులను చిదంబర్‌రెడ్డి కలిసి వినతి పత్రాన్ని అందించారు.

నామినేషన్ దాఖలు



నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందజేస్తున్న చుక్కా కుమారి

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీలో ఖాళీగా ఉన్న మూడో వార్డుకు మంగళవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల అధికారి గంగులయ్య తెలిపారు. మూడవ వార్డు వార్డు మెంబర్ చనిపోవడంతో ఆ స్థానాన్ని ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో చుక్కా కుమారి అనే మహిళ నామినేషన్ దాఖలు చేసిందన్నారు. నామినేషన్లకు 10వ తేదీ చివరి తేదీ అని, 11న స్క్రూట్నీ, 12 అప్పీలు, 14న ఉపసంహరణ, 19న ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు. 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించగా 2 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందన్నారు. అనంతరం గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ ఫాం అందజేస్తామన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

సంబేపల్లె : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో నా మట్టి – నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్నారు. 9న దేవపట్ల, రెడ్డివారిపల్లె, 10న పెద్దబిడికి, శెట్టిపల్లె, అడవకమ్మపల్లె, చిన్నబిడికి, 11న గురిగింజకుంట, దుద్యాల, గున్నికుంట్ల, మోటకట్ల, 12న సంబేపల్లె, పీఎస్ కాలనీ, నారాయణరెడ్డిపల్లె, రౌతుకుంట, 14న సోమవరం, గుట్టపల్లి, నాగిరెడ్డిపల్లెలో నిర్వహించడం జరుగుతుందని ప్రజాప్రతినిధులందరూ హాజరుకావాలని ఎంపీడీఓ నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటరు జాబితాలో ఫిర్యాదులను తెలియజేయండి

సంబేపల్లె : ఓటర్ల నమోదు, తప్పుల సవరణలకు సంబంధించి మండలంలోని పలు పార్టీల నాయకులతో మంగళవారం తహసీల్దార్ మహేశ్వరీభాయ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఇంటింటి సర్వేలో భాగంగా బీఎల్ఓలు చేస్తున్న ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై నాయకులతో చర్చించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ రావు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే ఉంటుందని ఆయన తెలియజేశారు. చనిపోయిన వారి జాబితా, వివాహం జరిగిన వారి జాబితా, పేరు మార్పిడి తదితర అంశాలపై సర్వే నిర్వహించామన్నారు. ఓటర్ల జాబితా సర్వేకు పార్టీ నాయకులు కూడా సహకరించాలన్నారు. ఈనెల 21వ తేదీలోపు సర్వే పూర్తి అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్వరీభాయ్



వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

సర్వేపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పెనగలూరు : ఓటర్ల జాబితా సర్వేపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. సర్వేకు గడువు కొద్దిరోజులు మాత్రమే ఉందని, బీఎల్‌ఓలతో సర్వే శాతాన్ని పెంచేలా కృషి చేయాలని, రెవెన్యూ సిబ్బంది కూడా బీఎల్‌ఓల వెంట ఉంటూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తెలియజేశారు. సర్వే చేసేటప్పుడు ప్రతి ఇంటికి వెళ్లి కచ్చితమైన సమాచారం సేకరించి అందుకు సంబంధించిన వివరాలను ప్రతిరోజూ సాయంత్రానికి అందించేలా కృషి చేయాలన్నారు. అనంతరం సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు.

తపాలా కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలు



మాట్లాడుతున్న అమర్‌నాథ్

రాజంపేట టౌన్ : తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు రాజంపేట సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌లు అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తపాలా కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. త్రివర్ణ పతాకాలు కావాల్సిన వారు తమ సమీపంలోని పోస్టాఫీసుల్లో ఇరవై ఐదు రూపాయిలు చెల్లించి పొందవచ్చన్నారు. అలాగే www. epostoffice. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆర్డర్ పెట్టినా తమ సిబ్బంది వారి అడ్రస్‌కు జెండాలను అందజేస్తారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, కార్యాలయాల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆహార పొట్లాల పంపిణీ

చిట్వేలి : మండల పరిధిలోని కె.కందులవారిపల్లెకు చెందిన బొద్దు తిరుపాలు 5వ వర్ధంతి సందర్భంగా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మానవత చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో పేదలు, యాచకులకు అందజేశారు. కార్యక్రమంలో దాతలు ఈశ్వరమ్మ, కార్తిక్, శ్రావణి, మానవత చైర్మన్ చౌడవరం సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు సాయిరాం పాల్గొన్నారు.

పుల్లంపేటలో పారిశుధ్య పనులు

పుల్లంపేట : వ్యాధులు విస్తరించేందుకు ప్రస్తుతం అవకాశాలు ఎక్కువ ఉన్న తరుణంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మెయిన్ రోడ్డు, శివాలయం వీధి, నాగలపూర్ గట్టు తదితర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న చెత్తను జేసీబీతో ఇతర ప్రాంతానికి తరలించారు. వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ప్రజలకు సూచించారు.

నేడు బైక్‌ల వేలం

సంబేపల్లె : వివిధ కేసులలో సీజ్ చేసిన నాలుగు బైక్‌లకు బుధవారం వేలంపాటు నిర్వహించనున్నట్టు ఎస్ఐ షరీఫ్ మంగళవారం తెలిపారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటకు హాజరుకావాలన్నారు.

నా భూమి.. నాదేశం

చిట్వేలి : మండల వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరామిరెడ్డి మంగళవారం తెలియజేశారు. ఎంఈజీఓ ఆధ్వర్యంలో ఏపీఓ పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందని, బుధవారం నుంచి పంచాయతీలలో శిలాఫలకం, చెట్లు నాటే కార్యక్రమాలు చేపడతామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, ఉపాధి సిబ్బంది, కూలీలు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీఓ చంద్రకళ కోరారు.

ఏపీఎన్‌జీఓ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : ఈనెల 21, 22 తేదీలలో జరుగబోవు ఏపీఎన్‌జీఓ 21వ రాష్ట్రకౌన్సిల్‌ను విజయవంతం చేయాలని రాయచోటి తహసీల్దార్ ప్రేమంత కుమార్, ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాయచోటి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డిలు పిలుపునిచ్చారు. 21వ రాష్ట్ర కౌన్సిల్‌కు సంబంధించిన గోడపత్రాలను మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వారు ఎన్‌జీఓ నేతలతో కలసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావాలంటూ కోరారు. ఉద్యోగస్తుల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించాలంటూ కౌన్సిల్ వేదికగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె తాలుకా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు బలరామరాజు, నేతలు నాగరాజు, మహమ్మద్‌బాషా, శ్రీనివాసులు, ప్రమీలమ్మ, వరలక్ష్మి, దేవేంద్ర, మహదేవ, జయప్రకాష్, ప్రసాద్, మహమ్మద్, అలీ, రవికుమార్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఏపీఎన్‌జీఓ సంఘం నేతలు

ఓబులేటికుంట పరిశీలన

రామాపురం : అమృత్ సరోవర్ పథకం క్రింద ఓబుల్‌రెడ్డి కుంటలో జరుగుతున్న పనులను మంగళవారం కేంద్ర పరిశీలకులు డాక్టర్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా కుంట ఎంత లోతు ఉన్నది, ఎంత విస్తీర్ణం, ఎంత మంది కూలీలు చేశారు. ఎంత పని చేశానే విషయంపై ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కుంటలో రూ. 6.71లక్షల కూలీలు పనులు చేశారని ఆమె తెలియజేశారు. అనంతరం కేంద్రం పరిశీలకులు లీలావతిని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడీ రెడ్డప్పనాయుడు, ఏపీఓ సురేంద్రనాథరెడ్డి, ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, అమీర్‌బాషా, నాగభూషణ్‌రెడ్డి, జలకళ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అమృత్ సరోవర్ కేంద్ర పరిశీలకురాలు డాక్టర్ లీలావతి

‘ప్రపంచ శాంతికి కృషి చేద్దాం’

సంబేపల్లె : అణ్వస్త్రాలను సమాజానికి ఉపయోగపడే అంశాలలో వినియోగిస్తే ప్రపంచ శాంతికి దోహదపడగలవని దేవపట్ల జెడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో నాగసాకి డే నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా 1945 ఆగస్ట 6న హిరోషిమ మీద, 9న నాగసాకి పైన అణు బాంబులను వేసిన ఉదంతాన్ని, దాని వల్ల జపాన్ దేశానికి జరిగిన నష్టాన్ని విద్యార్థులకు ఆయన వివరించారు. అణు పదార్థాన్ని వినియోగించి విద్యుత్‌ను భారీ మొత్తంలో ఉత్పత్తి చేయవచ్చునని విద్యార్థులకు ఆయన తెలియజేశారు. ప్రపంచ శాంతికి ప్రతి విద్యార్థి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పోతురాజు విగ్రహానికి ప్రత్యేక పూజలు

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామంలోని అంకాల పరమేశ్వరి దేవాలయంలో బుధవారం పోతురాజు విగ్రహానికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో పూజారులు సాయికిషోర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో పోతురాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వత్తలూరు కుమార్‌రెడ్డి, దురోగ్‌ప్రసాద్, సర్పంచ్ సావిత్రి, ఉప సర్పంచ్ రూపేష్ కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎల్లారెడ్డి, చొప్పా గంగిరెడ్డి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న సాయికిషోర్‌రెడ్డి

మర్రిచెట్టు తొలగింపునకు చర్యలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలోని కాండ్లమడుగు వద్ద 200 ఏళ్లనాటి మర్రిచెట్టు సోమవారం ఉదయం కూలిపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ భారీ చెట్టు రోడ్డుపై అడ్డంగా కూలడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. దీనిపై ఎస్ఐ రామమోహన్ చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు.



మర్రిచెట్టును ముక్కలు చేస్తున్న కూలీలు

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామసముద్రం : స్థానిక రాయచోటి జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన సీడబ్ల్యూఎస్ఎన్(దివ్యాంగులు) పిల్లల పరుగు పందెం పోటీలలో రామసముద్రం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన డి.శశికుమార్, లతాశ్రీ, కిసాన్ సాయి జిల్లా స్థాయిలో పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థాయిలో బహుమతి అందుకున్నారని తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ నారాయణస్వామి, భవిత టీచర్ నాగేంద్రప్రసాద్‌లను తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు, హెచ్ఎం, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



ప్రతిభ కనబరచిన రామసముద్రం విద్యార్థులు

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

రాయచోటి టౌన్ : తిరుమలలో వేంకటేశ్వర స్వామిని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కాగా స్వామి వారి దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.



వేంకటేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

రాయచోటి అర్బన్ : ప్రజాగాయకుడు గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని పౌరహక్కుల సంఘంతోపాటు వివిధ ప్రజా సంఘాల నేతలు తెలిపారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద వారు గద్దర్ మృతికి ఘనంగా నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ జనం గుండెచప్పుడై గళం ఎత్తిన ప్రజాకళాకారుడు, జననాట్య మండలి ఆవిర్భావకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ అన్నారు. గద్దర్ మాట, పాట దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయన్నారు. రచయితగా, కవిగా, గాయకుడిగా, వాగ్గేయకారుడిగా చరిత్ర సృష్టించిన ఘనత గద్దర్‌కే దక్కుతుందన్నారు. గద్దర్ మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, సహాయకార్యదర్శి ఎం.రవిశంకర్, మాజీ ఎంపీపీ నక్కా నారాయణ, రోశయ్య, న్యాయవాది నాగముని, ఆదిరెడ్డి నాయక్, మాజీ ఉప సర్పంచ్ పామయ్య తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పందిళ్లపల్లె గ్రామ పరిధిలోని దళితవాడలో నివాసం ఉంటున్న దళితుల భూములను ఆక్రమించిన భూ కబ్జాదారుల ఆన్‌లైన్‌ను రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం బాధితులతో కలిసి స్థానిక తహసీల్దార్ ఉదయశంకర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పందిళ్లపల్లె గ్రామ పరిధిలోని దళితవాడలో నివసిస్తున్న వరల చిన్న గంగయ్య, వరల పెద్దగంగయ్య, వరల ఈశ్వరమ్మ, బాలగుండ్ల వెంకటరమణల భూములను సర్వే నెంబరు. 629లో ఏడు ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు రెవెన్యూ అధికారులకు లక్ష రూపాయలు డబ్బులు ముట్టజెప్పి ఆన్‌లైన్ చేయించుకొని పాస్ బుక్‌లు పొందారన్నారు.

సదరు భూ రికార్డులను రద్దు చేసి అక్రమాలకు సహకరించిన రెవెన్యూ అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేసి దళితుల భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

జిల్లాకు ఉర్దూ డీఐ పోస్టును మంజూరు చేయండి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజ్ పోస్టును మంజూరు చేయాలని అల్ మేవా జిల్లా ప్రధాన కార్యదర్శి అసదుల్లాబాషా డిమాండ్ చేశారు. అల్‌మేవా సభ్యులతో కలసి మంగళవారం ఆయన డీఈఓ రామపురుషోత్తంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పాత చిత్తూరు జిల్లాలోని పలు ఉర్దూ పాఠశాలలు విలీనం అయ్యాయన్నారు. దీంతో జిల్లాలో ఉన్నత పాఠశాలలు 24, ప్రాథమికోన్నత పాఠశాలలు 46, ప్రైమరీ పాఠశాలలు 98 చొప్పున మొత్తం 168 ఉన్నాయన్నారు. ఈ పాఠశాలల పర్యవేక్షణకు, తనిఖీ చేసేందుకు ఒక జిల్లా స్థాయి ఉర్దూ అధికారి అవసరమన్నారు. ఇందుకోసం ఒక ఉర్దూ డీఐ పోస్టును మంజూరు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, అల్‌మేవా జిల్లా ట్రెజరర్ సునీర్, ఎస్టీయూ మైనార్టీ కన్వీనర్ బాషా, డైట్ లెక్చరర్‌లు రెడ్డెయ్య, అంజద్‌బాషా పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న అల్‌మేవా సభ్యులు

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన రోహిత్

నందలూరు(రాజంపేట) : సీఏవైడీ – నందలూరు క్రికెట్ సబ్ సెంటర్ నుంచి రోహిత్ వైఎస్ఆర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. పుల్లంపేటకు చెందిన రోహిత్ అక్కడి ఎస్‌బీవీడీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదుతున్నాడు. రోజూ నందలూరుకు వచ్చి ప్రాక్టీస్ చేసేవాడు. ఇదే కళాశాలలోనే నందలూరు సబ్ సెంటర్ హెడ్ కోచ్ గయాజ్ కూడా చదివి రంజీ ట్రోఫీ క్రీడాకారుడయ్యాడు. ఈ సబ్ సెంటర్ నుంచి వెంకటగిరిలో జరిగే కడప అండర్ – 16 విభాగంలో ఆడనున్నాడు. రోహిత్ ఎంపికపై హెడ్ కోచ్ గయాజ్, అసిస్టెంటు కోచ్ ఫిరోజ్‌ఖాన్ లోడి, ట్రెనర్ శివకోటి, క్యురేటర్ హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



రోహిత్

‘స్థాయి మరిచి విమర్శిస్తే చూస్తు ఊరుకోం’

సిద్దవటం : మేడా విజయశేఖర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల కన్వీనర్ సింగం నీలకంఠారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదన్నారు. నీవు వైఎస్ఆర్‌సీపీలో అభివృద్ధి చెంది ఇప్పుడు ఆపార్టీ నాయకులనే వ్యక్తిగతంగా విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. నీ పేరు ముందర మేడా అనే రెండు అక్షరాలు లేకపోతే నీ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసని తెలియజేశారు. నియోజకవర్గంలో భూ కుంభకోణాలు చేసి బినామీలకు ఇచ్చినది వాస్తవం కాదని ఆరోపించారు. సుండుపల్లె మండలంలో ఒక పేద దళిత మహిళ భూమిని ఆక్రమించుకొని అందులో ఉన్న మామిడి చెట్లను నీ అనుచరులతో తొలగించలేదా అని ప్రశ్నించారు. రాజంపేట అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు రావాలంటూ పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి మాట్లాడుతూ మేడా పెద్దబాబు ఏదో అనుకుంటున్నారు ఆయన ఒక వలంటరీకి కూడా సాటిరాడన్నారు. నేతల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. స్థాయిని మరిచి మాట్లాడితే నీ పరిస్థితి మరోలా ఉంటుందని గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. ఉపాసి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విజయశేఖర్‌రెడ్డి నీవు పార్టీ మారినంత మాత్రాన ఒరిగేది ఏమి లేదని అది గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శులు వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, నిర్మకాయల ప్రసాద్‌రెడ్డి, మేకల చంద్ర ఓబుల్‌రెడ్డి, రావుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కబ్జాల విజయశేఖర్ ఖబడ్దార్

రాజంపేట రూరల్ : కబ్జాల చేసే మేడా విజయశేఖర్ రెడ్డి నీ స్థాయి మరిచి మా ఎంపీ పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే మేడాలను విమర్శిస్తే చూస్తూ ఊరకోం ఖబడ్దార్ అంటూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొల్లినేని రామ్మోహన్‌నాయుడు హెచ్చరించారు. జాతీయ రహదారిపైనున్న ఎమ్మెల్యే మేడా భవన్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జీవీ కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్‌ల ఇంచార్జీ వెలగచెర్ల గంగిరెడ్డి, నాయకులు గంగా బాబుల్‌రెడ్డిలతో కలిసి బి.రామ్మోహన్‌నాయుడు విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మేడా అనే ఇంటి పేరు నీకు ముందు లేకపోతే నువ్వు జీరోవని గుర్తుంచుకో శేఖర్‌రెడ్డి అని హితబోధ చేశారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తన సమీప బంధువన్న ఒక కారణంతో నీకు సుండుపల్లె మండల బాధ్యతలు అప్పగించకుంటే నీకు రాజకీయ భవిష్యత్తు ఉండేదా అని ప్రశ్నించారు. సుండుపల్లి మండలంలో నీవు అరచకాలు, దౌర్జన్యాలు, కబ్జాలు చేసినది వాస్తవం కాదా అని నిలదీశారు. ఇటువంటి నీ అగడాల వలన అటు పార్టీకి ఇటు ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డితోపాటు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి చెడ్డ పేరు వస్తుందని నిన్ను పక్కన పెట్టడం తప్పా అని ప్రశ్నించారు. సుండుపల్లెలో నీవు చేసిన అక్రమాల చిట్టా ఆధారాలతో సహ ఉన్నాయని హెచ్చరించారు. వార్డు మెంబరుగా కూడా గెలవని నీకు మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని విమర్శించే అర్హత ఉందా అని నిలదీశారు. టీడీపీ ఎమ్మెల్యే టికెట్ నాకేనని నీవు సొంత డప్పా కొట్టుకోవటం మినహా నీవంటి కబ్జా కోరును చంద్రబాబు దగ్గరికి రానివ్వడని గుర్తు చేశారు.

శాంతి భద్రతలలో ఆదర్శంగా నిలపండి

రాయచోటి టౌన్ : శాంతి భద్రతలలో రాయచోటి ఆదర్శంగా నిలవాలని రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన తులసీరాంకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఐతో మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీ పడకుండా నిఖచ్చిగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

15 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని జాండ్లతాండాలో దాడులు నిర్వహించి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కుసుమనాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు.